# ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రేక్షకులు కారాదు



**ప్రజలారా!**

రాష్ట్రం విడిపోయి సంవత్సరం దాటిపోయింది. అనేక వాగ్దానాలతో ప్రజల్లో పలు ఆశలు రేకెత్తించి రెండు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. ప్రతిపక్షంలో ఉండగా తాము తీవ్రంగా విమర్శించిన విధానాలనే చంద్రబాబు, కె.సి.ఆర్.లు అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలకూ, కార్పొరేట్ సంస్థలకూ ఉభయ రాష్ట్రాల్లోని సహజ వనరులను నైవేద్యంగా సమర్పించి, వాళ్ళ నుండి కమీషన్లు దండుకోవడానికి ఇద్దరూ పోటీ పడుతున్నారు. రైతుల్నుంచి వ్యవసాయ భూముల్ని లాక్కొని కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. తాగునీటి, సాగునీటి అవసరాల పేరుతో ప్రజల డబ్బుతో ప్రాజెక్టులు కట్టి, లీటరు నీటిని పైసా, రెండు పైసల నామమాత్రపు రేటుకు పరిశ్రమలకు సరఫరా చేయబోతున్నారు. విచ్చలవిడిగా థర్మల్ ప్లాంటులు నెలకొల్పి పరిశ్రమలకు విద్యుత్‌నూ, ప్రజలకు కాలుష్యాన్నీ పంచిపెట్టబోతున్నారు. ఉమ్మడి వనరులను ప్రజల మేలు కోసం ఉపయోగించాలనే రాజ్యాంగ ఆదేశిక సూత్రాన్ని అపహాస్యం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి ఏమాత్రం రాయితీలు ఇవ్వకుండా, ప్రకటించిన ఋణమాఫీలను సైతం సక్రమంగా అమలు చేయకుండా, రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు కల్పిస్తూ, పారిశ్రామికవేత్తలకు మాత్రం కోట్లాది రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్నారు.

స్వదేశీ, విదేశీ పెట్టుబడులు అధిక లాభాలు పిండుకోవడానికి అనువైన పరిస్థితులు కల్పించటమే పరిపాలన అని భావిస్తున్నారు. పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించటమే అభివృద్ధి అని ప్రచారం చేస్తున్నారు. పాలకులు ప్రవచిస్తున్న ఈ అభివృద్ధి నమూనా వల్ల అగ్రకులాల్లోని అతి కొద్దిమందికి చెందిన ఆస్తులు అంతులేని విధంగా పెరిగిపోయాయి కాని అణగారిన కులాలకు, వర్గాలకు చెందిన వాళ్ళు, ముఖ్యంగా ఆదివాసులు ఈ అభివృద్ధి వల్ల చాలా నష్టపోయారు. వాళ్ళ జీవన ప్రమాణాలు, పరిస్థితులు మరింతగా దిగజారాయి.

సంపద ఒకే చోట పోగుపడే విధంగా ఆర్థిక వ్యవస్థ పనితీరు ఉండకూడదనే రాజ్యాంగ ఆదేశిక సూత్రానికి పూర్తి విరుద్ధంగా అంతరాలను మరింతగా పెంచే అభివృద్ధి నమూనాలనే మన ప్రభుత్వాలు అమలు పరుస్తున్నాయి. ఎందుకంటే అభివృద్ధి అనేది లాభదాయకమైన పరిశ్రమగా మారిపోయింది. అవినీతికి పర్యాయపదమైంది. అభివృద్ధి ఫలాల్లో సింహభాగాన్ని పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ కంపెనీలు దక్కించుకుంటున్నాయి. మిగిలిన భాగాన్ని పాలక పార్టీల నేతలూ, వాళ్ళ అనుచర గణం, ఆధిపత్య కులాలకు చెందిన గ్రామస్థాయి నాయకులు వాళ్ళ వాళ్ళ స్థాయిలను బట్టి పంచుకుంటున్నారు. మనం నిలదీసి అడగకపోతే ఈ పరిస్థితిలో ఎప్పటికీ మార్పు రాదు. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రేక్షకులు కారాదని కోరుతున్నాం.

**హక్కులు అడుగుదాం... అమలు చేయించుకుందాం**

## మళ్లీ రంగంపైకి రిజర్వేషన్ వ్యతిరేకత

'పుష్కరానికొకసారి మన దేశంలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు పుట్టుకొస్తుంటాయి. అవే వాదనలతో, అవే నినాదాలతో అవే చేష్టలతో ఒక కొత్త తరం కులదురహంకారాన్ని ప్రదర్శిస్తుంటుంది' అని బాలగోపాల్‌గారు దాదాపు పదేళ్ల క్రితం రాశారు. ఇప్పుడు సరిగ్గా అదే జరుగుతోంది. అయితే ఈసారి వ్యూహం మార్చి, బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని కాక తమకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని గుజరాత్‌లోని సంపన్నులైన పటేల్ కులస్తులు రోడ్డెక్కి ఆందోళనలు చేయడం మొదలుపెట్టారు. దీనికి ఇతర సంపన్న అగ్రకులాల నుంచి ఎంత వేగంగా మద్దతు లభిస్తున్నదో చూస్తే ఆశ్చర్యమేస్తుంది. మన రాష్ట్రం కూడా దీనికి మినహాయింపు కాదు. రిజర్వేషన్ల విధానంలో ఎలాంటి మార్పూ ఉండదని కేంద్రప్రభుత్వం హామీ ఇస్తున్నప్పటికీ ఇది రిజర్వేషన్ ప్రయోజనం పొందుతున్న వర్గాలను నైతికంగా దెబ్బతీసే ప్రయత్నమనేది స్పష్టమవుతోంది. ఈ ధోరణిని ఆదిలోనే అడ్డుకోకపోతే అది విషవృక్షంలా పెరిగే ప్రమాదముంది. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రేక్షకులు కారాదని కోరుతున్నాం.

## ఆగని రైతు ఆత్మహత్యలు

నూతన ఆర్థిక విధానాల కంటే ముందే ప్రభుత్వం హరిత విప్లవం పేరుతో 1970లలో వ్యవసాయ రంగంలోకి యంత్రాలను, ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టింది. హైబ్రీడు విత్తనాలను, రసాయనిక ఎరువులను, పురుగు మందులను, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు లాంటి యంత్రాల వినియోగాన్ని సబ్సిడీలు ఇచ్చి మరీ ప్రోత్సహించింది. ఆధునిక పద్ధతులు అవలంబించకుండా వ్యవసాయం కొనసాగించడం ఏ మాత్రం సాధ్యం కాని పరిస్థితులు ఏర్పడిన తర్వాత, ఆ రంగంలో బహుళజాతి కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలకు ఢోకా లేదనే భరోసా వచ్చాక, వ్యవసాయ రంగానికి ఇస్తున్న సబ్సిడీలన్నిటినీ ఉపసంహరించుకుంది. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి కౌలు రైతులూ, చిన్న, సన్నకారు రైతులూ ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి తీసుకువచ్చింది. దీని పర్యవసానాలు లక్షలాది రైతుల ఆత్మహత్యల రూపంలో మనం చూస్తున్నాం. గత జూన్ 2 తర్వాత తెలంగాణలో 1290 రైతుఆత్మహత్యలు జరిగితే, ఆంధ్రప్రదేశ్‌లో అవి 400 దాటాయి.

పెట్టుబడి ఎదుగుదలకూ, భారీ లాభార్జనకూ గ్రామీణ ప్రాంతంలో అవకాశాలు తగ్గిపోవటంతో కార్పొరేట్ శక్తులు ఇప్పుడు పట్టణాలవైపే పూర్తిగా దృష్టి సారించాయి. 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యంనుండి బయట పడడానికి అభివృద్ధి చెందిన దేశాలు రకరకాల మార్గాలను అన్వేషించి స్మార్ట్ సిటీల అభివృద్ధిని పరిష్కారంగా ఎంచుకున్నాయి. తమ పెట్టుబడినీ, టెక్నాలజీనీ వర్ధమాన దేశాలకు భారీగా దిగుమతి చేయటానికి స్మార్ట్ సిటీలు బాగా ఉపయోగపడతాయనీ, తద్వారా వచ్చే లాభాలు మరో ఆర్థిక మాంద్యం బారిన పడకుండా తమను కాపాడుతాయనీ భావించాయి. అందుకే పెద్దఎత్తున పట్టణీకరణ జరగాలని 2009 నుండి ఊదరగొట్టడం మొదలు పెట్టాయి. అంతేకాదు గ్రామాలు కుంచించుకుపోయి, పట్టణాలు వృద్ధి చెందటం కార్పొరేట్లకు కూడా ఇప్పుడు అవసరమైపోయింది. వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రమై ప్రజలు గ్రామాల నుండి పెద్దఎత్తున పట్టణాలకు వలసలు రావడమే వారికి కావాలి. ఉన్న పట్టణాల సైజు పెరగాలి. కొత్త పట్టణాలు వెలవాలి. అందుకోసం భూముల్ని భారీ ఎత్తున సేకరించాలి. భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన రాకుండా ఉండాలంటే, వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితులు కల్పించి, రైతులు వ్యవసాయ భూముల్ని వదులుకోవటానికి సిద్ధపడేలా చేయాలి. "వ్యవసాయం చేయటం ఇక మా వల్ల కాదు. మా మిగిలిన భూముల్ని కూడా మీరే కొనుక్కునో, కౌలుకు తీసుకునో అభివృద్ధి చెందిన దేశాల్లో లాగా కార్పొరేట్ వ్యవసాయం చేసుకోండి. మీ యంత్ర భూతాల కోరలు తోమే ఏదో ఒక పనిని మాకు కూడా కల్పించండి" అని అభ్యర్థించే పరిస్థితికి రైతుల్ని నెట్టాలి. వ్యవసాయ కూలీలు పట్టణ అడ్డా కూలీలుగా మారాలి. వాళ్ళ శ్రమ శక్తి కారుచౌకగా కార్పొరేట్లకూ, కార్పొరేట్ ఉద్యోగులకూ లభించాలి. ఇదీ ప్రస్తుతం పాలకులు అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాల అసలు సారాంశం. అందుకనే గ్రామీణ ప్రాంతాలను గాలికొదిలేసి, పట్టణాల అభివృద్ధి గురించి మాత్రమే ఇరు రాష్ట్రాల నేతలూ మాట్లాడుతున్నారు. బలవంతపు భూసేకరణకు వీలు కల్పిస్తూ మోదీ తెచ్చిన ఆర్డినెన్స్‌లను సమర్ధించడంలో ఇద్దరూ ముందున్నారు. రాజధానులను

పరిపాలనా కేంద్రాలుగా కాకుండా, పెట్టుబడి కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని అంటున్నారు. గతం నుండి ఏ మాత్రం గుణపాఠాలు తీసుకోకుండా, అభివృద్ధిని ఒకే చోట కేంద్రీకరిస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. అమరావతి అభివృద్ధే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అన్నట్లుగా, హైదరాబాద్ అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అన్నట్లుగా విధాన నిర్ణయాలు ప్రకటిస్తున్నారు. ప్రాంతీయ అసమానతలు పెంచుతున్నారు. దానికి రాయలసీమ ఒక ఉదాహరణ.

# రాయలసీమ ఊసే లేదు

**రా**ష్ట్ర విభజనకు ముందు రాయలసీమ గురించి అంతో ఇంతో అయినా వినిపించేది కాని విడిపోయాక ఆంధ్రప్రదేశ్ ప్రధాన స్రవంతి రాజకీయాలలో రాయలసీమ అసలు చర్చనీయాంశంగానే లేకుండా పోయింది. కోస్తాంధ్రలో రానున్న అనేక కొత్త కొత్త ప్రాజెక్టులు, ఉన్నత విద్యాసంస్థల గురించి నిత్యం వింటున్న వారికి రాయలసీమలో అసలు మనుషులే లేరేమో అనిపించేట్టుగా అక్కడ ఒక్క కొత్త సంస్థ నెలకొల్పే ప్రతిపాదన కూడా వినబడడం లేదు. ప్రాస కలిసిందనేమో పట్టిసీమ ప్రాజెక్టు రాయలసీమ కోసమేనని పదే పదే చెబుతున్నారు. అది ఆచరణలో ఎంత అబద్ధమో నదీజలాల పంపకంతో పరిచయం ఉన్న వారెవరికైనా అర్థమయ్యే విషయమే. అంతే కాదు పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా 80 టి.యం.సిల నీరు తోడిపోస్తామని, ఆరు లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై కూడా అనేక సందేహాలున్నాయి. సాధ్యాసాధ్యాల గురించి ప్రశ్నలు అడిగినవాళ్లకు సమాధానాలు చెప్పకుండా ఉండడమే కొత్త పాలకులు అనుసరిస్తున్న కొత్త పరిపాలనా విధానం. పారదర్శకత లేకుండా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలూ ఇష్టానుసారంగా తీసుకుంటున్న అనేక నిర్ణయాలు, చేపడుతున్న అనేక పనులు మరికొన్ని ప్రాంతీయ అసమానతలకు దారితీసే ప్రమాదం కనబడుతున్నది. ప్రశ్నించే ప్రజలే వీటిని అడ్డుకోగలరు. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రేక్షకులు కారాదని కోరుతున్నాం.

# హిందూత్వ ప్రమాదం

**పై**న చెప్పిన అభివృద్ధి నమూనానే కేంద్రంలో మోదీ మరింత దూకుడుగా అమలు చేస్తున్నాడు. మరోవైపు బిజెపికి చెందిన కొంతమంది ఎంపిలూ, మంత్రులూ ప్రజల భావోద్రేకాలను రెచ్చగొడుతున్నారు. ఇండియా వెలిగిపోతుందనే నినాదంతో 2004 ఎన్నికల బరిలో దిగి, భంగపడ్డ విషయాన్ని హిందూత్వశక్తులు మర్చిపోలేదు. ప్రజల మెదళ్ళలోకి హిందూ మతోన్మాదాన్ని దట్టించకపోతే భవిష్యత్ ఎన్నికల్లో గెలుపుకు గ్యారంటీ లేదని గ్రహించారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండే ప్రవీణ్ తొగాడియా లాంటి వాళ్ళతోపాటు సాధ్వి రీతంబర, సాధ్వి జ్యోతి, స్వామి ఆదిత్యనాథ్, సాక్షి మహారాజ్ లాంటి పార్లమెంటు సభ్యులను కూడా రంగంలోకి దింపి మతోన్మాద విషాన్ని అనునిత్యం వెదజల్లుతున్నారు. దేశంలోని బహుళ సంస్కృతులను ధ్వంసం చేసి, బ్రాహ్మణీయ సంస్కృతిని ప్రజలందరి మీదా రుద్దాలనే లక్ష్యంతో శాస్త్ర, సాంకేతిక, సామాజిక రంగాల్లోని అన్ని ప్రభుత్వ సంస్థలకూ అర్హతలతో నిమిత్తం లేకుండా సంఘ్‌పరివార్‌కు చెందినవాళ్ళనే నియమిస్తున్నారు. బౌద్ధం తర్వాత బ్రాహ్మణులు అలవాటు చేసుకున్న శాకాహారం అనాది నుండీ ఈ దేశ సంస్కృతి అయినట్లుగా ప్రజలందరి మీద బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. మహారాష్ట్రలో, మరికొన్ని రాష్ట్రాల్లో బీఫ్‌పై నిషేధం విధించడం ఇందులో భాగమే. లేని లవ్ జిహాద్‌ను ముస్లింలకు అంటగట్టి, మతాంతర వివాహాలను అడ్డుకుంటున్నారు. భిన్నాభిప్రాయాల్ని సహించలేని అసహన ధోరణుల్ని పెంచి పోషిస్తున్నారు. పన్సారే, ధబోల్కర్, కల్బుర్గి లాంటి మేధావులను దారుణంగా హత్య చేయటం ద్వారా ఒక భయానక వాతావరణాన్ని సృష్టించి, హిందూత్వంతో విభేదించే వాళ్ళు ఇక నోరెత్తకుండా చెయ్యాలని చూస్తున్నారు. హిందూ దేవుళ్ళను విమర్శించినందుకు కంచ ఐలయ్యపై సంఘ్‌పరివార్ శక్తులు పెట్టిన కేసు దీనికి ఒక ఉదాహరణ. భావ ప్రకటనా స్వేచ్ఛపై నిరంతరం ఇలాంటి దాడులు చేస్తూ జీవించే హక్కునూ, వ్యక్తి స్వేచ్ఛనూ కాలరాస్తున్నారు.

మోదీ అంత మొరటుగా కాకపోయినప్పటికీ, కె.సి.ఆర్., చంద్రబాబులు కూడా హిందూత్వ బాటలోనే నడుస్తున్నారు. యాదగిరిగుట్టను యాదాద్రిగా మార్చి దాని అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా కె.సి.ఆర్, అమరావతికి హిందూ సాంప్రదాయ పద్ధతిలో భూమిపూజ నిర్వహించటం, పుష్కరాలకు బందోబస్తు, కనీస సౌకర్యాలు కల్పించటంతో ఆగకుండా, పుష్కరాల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టి, దానికి పెద్దఎత్తున ప్రచారం కల్పించటం ద్వారా చంద్రబాబు – ఇద్దరూ కూడా లౌకిక ప్రభుత్వాధినేతలుగా కాకుండా, హిందూమత ప్రచారకుల లాగా వ్యవహరించారు. చంద్రబాబు ప్రచార యావకు పుష్కరాల్లో 24 మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. భిన్న సంస్కృతులు కలిగిన దేశంలో రాజ్యానికి లౌకిక స్వభావం ఉండడం ఎంత అవసరమో మీకు తెలియంది కాదు. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రేక్షకులు కారాదని కోరుతున్నాం.

## ఎన్‌కౌంటర్లు, లాకప్‌డెత్‌లు

రాజ్యహింస విషయంలోనూ ఇరు రాష్ట్రాలూ ఒకే బాటలో సాగుతున్నాయి. ఇద్దరు ముఖ్య మంత్రులూ పోలీసులతో పకడ్బందీగా హత్యలు చేయించి, ఎదురుకాల్పులని బుకాయిస్తున్నారు. తెలంగాణలో మూడు ఘటనలలో 8 మందిని ఎదురుకాల్పుల పేరిట కాల్చి చంపితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంఖ్య 23. ఒక్క శేషాచలం ఎన్‌కౌంటర్‌లోనే 20 మంది ఎర్రచందనం కూలీలను కాల్చి చంపారు. లాకప్‌డెత్‌లు కూడా ఇరు రాష్ట్రాలలో మళ్ళీ మొదలయ్యాయి. ఇప్పటికే తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 5 జరిగాయి. వ్యవస్థ పట్ల మౌలికమైన అసమ్మతి గల ప్రజా సంఘాలకు సమావేశాలు జరుపుకోటానికి అనుమతి ఇవ్వకపోవడం, ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న దమనకాండకు భయపడి ఖమ్మం అడవులలోకి పారిపోయి వచ్చిన గొత్తికోయల గుడిసెలను తగలబెట్టించడం, ఇసుక మాఫియాలను పెంచి పోషించి పర్యావరణాన్ని నాశనం చెయ్యడం వంటి ఎన్నో ప్రజావ్యతిరేక పనులకు పాల్పడుతున్నారు. రెండు రాష్ట్రాలలోను సరైన ప్రతిపక్షం లేకపోవడం ప్రశ్నించే గొంతుల అవసరాన్ని మరింత పెంచింది. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రేక్షకులు కారాదని కోరుతూ... మా గొంతుకు మీ గొంతుల్ని కలపమని కోరుతూ కర్నూలు జిల్లా ఆదోనిలో అక్టోబర్ 10, 11 తేదీలలో జరిగే మా ఆరవ మహాసభలకు రమ్మని ఆహ్వానిస్తున్నాం.

### మానవహక్కుల వేదిక
### 6వ మహాసభల కార్యక్రమం

| | | |
|---|---|---|
| తేది | : | 10 అక్టోబర్ 2015 |
| స్థలం | : | కె.జి.ఎన్ ఫంక్షన్ హాలు, ఆదోని, కర్నూలు జిల్లా. |
| సమయం | : | ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు |
| ఉదయం | : | **నయా ఉదారవాదం - హిందూత్వ నమూనా**<br>**సుభాష్ ఘటాడె**<br>రచయిత, హక్కుల కార్యకర్త – ఢిల్లీ |
| | | **అంబేద్కరిజాన్ని బ్రాహ్మణీకరించే కుట్ర**<br>**డా. పి.డి. సత్యపాల్**<br>అసోసియేట్ ప్రొఫెసర్, ఆంధ్రాయూనివర్శిటీ |
| మధ్యాహ్నం | : | **ప్రభుత్వం - కొత్త భూస్వామ్య పద్ధతులు**<br>**డా. ఉషా రామనాథన్**<br>పరిశోధకురాలు, ఢిల్లీ |
| | | **అసమాన అభివృద్ధి - రాయలసీమ దుస్థితి**<br>**ఎ. చంద్రశేఖర్**<br>హెచ్‌ఆర్‌ఎఫ్ ఉపాధ్యక్షులు |
| సా. 5 గం. | : | ఊరేగింపు |
| సా. 6 గం. | : | మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ |

**సదస్సుకూ, బహిరంగ సభకూ అందరికీ ఆహ్వానం**

**అక్టోబర్ 11 సంస్థాగత కార్యక్రమం మాత్రమే**

మానవ హక్కుల వేదిక

30.9.2015 **Human Rights Forum (HRF)**

ప్రచురణకర్తలు : ఎస్. జీవన్‌కుమార్ – 98489 86286, వి.ఎస్.కృష్ణ – 94404 11899